
ప్రజాశక్తి

మంగళవారం 5 డిసెంబర్ 2023

5

పార్వతీపురం మన్యం



జిల్లా సమగ్రాభివృద్ధిపై 17న సదస్సు : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం:

జిల్లా సమగ్రాభివృద్ధికై ఈనెల17న బెలగాం చర్చిసెంటర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సదస్సులో జిల్లా అభివృద్ధి కోసం చర్చించి సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, రాజకీయాలకు అతీతంగా పోరాడి జిల్లాను అభివృద్ధి చేసుకుందామని, అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో ఎంపిటిసి సభ్యులు మండంగి రమణ, సర్పంచ్ కె.రామస్వామి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, యమ్మల మన్మధరావు, కోలక అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై.నాయుడు, జి.వెంకటరమణ, కోరాడ ఈశ్వరరావు, కె.సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తుపానుతో రైతుల్లో వణుకు



గుమ్మలక్ష్మీపురం : వరికుప్పలపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు



పార్వతీపురం : ధాన్యం బస్తాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న రైతులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

తుపాను వల్ల జిల్లాలో చాలా ప్రాంతాల్లో వర్షం కురవడంతో రైతులు తమ పంటను కాపాడుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఇప్పటికే అమ్మకానికి సిద్ధంగా ఉన్న దాన్ని రవాణాకు వాహనాలు లేకపోవడంతో కొంతమంది రైతులు సొంతంగా వాహనాలను ఏర్పాటు చేసుకొని తమ ధాన్యాన్ని తరలించుకుపోయే పనిలో ఉండగా, మరి కొంతమంది రైతులు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని టార్పలిన్లతో కప్పి భద్రపర్చుకొంటున్నారు. ఇప్పటికే పొలంలో కోసి ఉన్న పంటను కుప్పలు వేసుకుని పంటను తడవకుండా కాపాడుకునే పనిలో కొంతమంది రైతులు నిమగ్నమైనారు. కల్లాల్లో, పొలాల్లో ఎక్కడ చూసినా రైతులు పండిన పంటను, అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని, బస్తాండ్లో నింపిన ధాన్యాన్ని తరలించే పనిలోనే ఉంటూ తమ పంటను కాపాడుకునే పనిలోనే ఉన్నారు.

పాలకొండ: తుపాను హెచ్చరికతో రైతులకు పాట్లు తప్పటం లేదు. సోమవారం ఓ మోస్తారు వర్షం కురువడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. వరి పొలాలు, కల్లంలో ఉన్న వరికుప్పలను తర్పాన్లనతో రక్షణ కల్పించుకున్నారు. మండలంలో 17 వేల ఎకరాల్లో వరిసాగవుతోంది. అయితే ఈసారి సాగునీరందక వ్యయప్రయాసాలు పడి మోటర్లు సాయంతో సాగునీటిని పొలాలకు అందించారు. పంట చేతిక అందిన సమయంలో తుఫాన్లు రావడంతో పంట ఏమివుతుందో తెలియక రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో గోపాలపురం, భాసూరు, వి.పి రాజుపేట, అంపిలి తదితర ప్రాంతాల్లో పొలాల్లోనే ధాన్యం కుప్పలు ఉన్నాయి. దీంతో ధాన్యం తడిసి రంగు మారుతుందన్న భయంతో ఆందోళన చెందుతున్నారు. మూడు రోజులపాటు ఈ వర్షాప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : సిపిఎం

పార్వతీపురం రూరల్ : తుపానును దృష్టిలో ఉంచుకుని, అధికారులు యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని అడ్డాపుశీల, పిఆర్ఎన్‌వలస, కోటవానివలస గ్రామాల్లో సోమవారం పర్యటించి కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కోరారు. జిల్లా సివిల్ సప్లయ్, వ్యవసాయ, ఆర్‌బికె అధికారులు కొనుగోలు ప్రారంభించినా సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో తుపాను తీవ్రత పెరుగుతున్నందున యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని నిబంధనల పేరుతో ఆపకుండా, గిట్టుబాటు ధరకే కొనుగోలు చేయాలని, వీటిని తరలించేందుకు సరిపడా వాహనాలను ప్రభుత్వం సమకూర్చాలని కోరారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

మిచాంగ్ తుపాన్ తరుముకొస్తున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర కోరారు. సోమవారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రానున్న రెండు రోజుల్లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. నూర్పు ఆయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు.ఆఫ్ లైన్ లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. మూడు, నాలుగు రోజుల పాటు వరి కోతలు వాయిదా వేసుకొనేలా రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. వ్యవసాయ, రెవిన్యూ, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖల అధికారులు తుఫాన్ ప్రభావం వల్ల జరగబోయే నష్టాలను అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈనెల 6 వరకు అధికారులెవరూ సెలవులో వెళ్లరాదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన శిఖర గ్రామాల్లో కొండచరియలు విరిగిపడి గాని, పూరిళ్ళు నేలమట్టం కావడం గాని వుంటే స్థానిక గిరిజనులను అప్రమత్తం చేయాలని రాజన్నదొర సూచించారు.

సీతంపేట : ఏజెన్సీలో మిచాంగ్ తుపానుతో రైతుల గుండెల్లో గుబులు పట్టుకుంది. రెండు రోజులుగా ఈ తుపాను ప్రభావం ఉండడంతో అధికారులు ఇప్పటికే అప్రమత్తం చేశారు. ఏజెన్సీలో చినరామదేవనాపురం, పెదరామం, దోనుబాయి తదితర ప్రాంతాల్లో కోతలైపోవడంతో రైతులు ఆదరా బాధరాగా వరి చేను పంట పొలాల్లోనే కుప్పలు వేస్తున్నారు. మరి కొంతమంది వరిచేలపై టార్పన్ కప్పుతున్నారు. చేతికి అందించిన పంట చేజారిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది 2532 ఎకరాల్లో వరి నాట్లు పడగా, 580 ఎకరాల వరకు కోతలు జరిగాయి. కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పనిలో రైతులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : తుపాను కారణంగా గుమ్మలక్ష్మీపురంలో చిరుజల్లులు కురవడంతో గిరిజన రైతుల్లో ఆందోళన మొదలైంది. పొలాల్లో కాస్త మిగిలి ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు రైతులు అప్రమత్తమయ్యారు. కోసిన వరి పంట కల్లానికి తీసుకువచ్చి కుప్పలుగా పెట్టి టార్పాన్లతో కాపాడుకుంటున్నారు. మరి కొన్నిచోట్ల ఆదివారం రాత్రి నుంచి మిషన్లతో నూర్పులు చేపట్టి పంటను ఇంటికి తీసుకెళ్తున్నారు. సకాలంలో వర్షాల్లేక పంట ఎండిపోయి కరువు ఏర్పడిందని ఆందోళన చెందుతున్న తరుణంలో మరోవైపు తుఫాను ప్రభావంతో మిగిలిన కాస్త పంటైన దాచుకునేందుకు రైతులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతం.

అప్రమత్తమైన అధికారులు

తుపాను కారణంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. ఎటువంటి విపత్తు వచ్చిన సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలంలోని 27 పంచాయతీలు అధికారుల దృష్టి సాధించారు. తుపాను కారణంగా ప్రజలు ఇంటి నుంచి బయటకు రావద్దని కోరారు.

కురుపాం : వాతావరణ మార్పులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ఎక్కడ వర్షం పడుతుందోనని వరిరైతులు వణికిపోతున్నాయి. ప్రస్తుతం మండలంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. చాలాచోట్ల కోసిన పైరు పనలపై ఉంది. ఈ తరుణంలో సోమవారం అకస్మాత్తుగా చిరుజల్లులు పడడంతో అన్నదాతల కంగారుపడుతున్నారు. పంటను రక్షించుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. కోసిన పనులను సురక్షిత ప్రాంతాలకు చేర్చుతున్నారు. మండలంలో సుమారు 1700 వేల వరిసాగు చేశారు. ముందుగా నాట్లు వేసిన వరి పైరు కోతలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వర్షం కురిస్తే వరి పనలు, ధాన్యం పాడైపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు చేలల్లోని వరి పనలను, ట్రాక్టర్లపై కొందరు మనుషులు తో కొందరు సురక్షిత ప్రాంతాలకు తరలించి వాటిపై పరదాలు కప్పి రక్షణ చర్యలు చేపడుతున్నారు.

అత్యవసరమైతేనే బయటకు రండి

తుపాను దృష్ట్యా కలెక్టర్ విజ్ఞప్తి

నేడు పాఠశాలలకు సెలవు



ప్రజాశక్తి - పార్వతీపురం

మిచౌంగ్ తుపాను తీవ్రత దృష్ట్యా ప్రజలెవరూ మంగళ, బుధవారాలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుఫాను తీవ్రత దృష్ట్యా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం నుంచి తుపాను తీవ్రత ఎదుర్కొనేందుకు అన్ని చర్యలూ చేపట్టామని ఆయన చెప్పారు. జిల్లాలో మనుషులు, జంతువు ప్రాణ నష్టం, పంట నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకున్నామని అన్నారు. మిగ్ జామ్ తుపాను ఏర్పాట్లపై సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో 4,200 మెట్రిక్ టన్నుల మేర నూర్పులు జరగ్గా 629 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద సురక్షితంగా ఉందని, మిగిలిన మొత్తం ధాన్యం యుద్ధ ప్రాతిపదికన మిల్లులకు తరలించామని చెప్పారు. ధాన్యం గానీ, ఇతర పంటలు ఎక్కడ ఉన్నా వ్యవసాయ సహాయకులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. పంట కోయకుండా ఉంటే అలాగే ఉంచాలని ఆయన సూచించారు.

తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా గ్రామీణ నీటి సరఫరా విభాగం 79 జనరేటర్లు సిద్ధం చేసిందన్నారు. రహదారులపై చెట్లు, స్తంభాలు కూలితే తక్షణం తొలగించేందుకు జిల్లా విపత్తుల స్పందన శాఖ నుండి 13, రహదారులు, భవనల శాఖ నుండి 15 బృందాలు సిద్ధం చేశామని చెప్పారు. జిల్లాలోని 39 పెట్రోల్ బంకులు పూర్తి సామర్థ్యంతో ఉండాలని, మొబైల్ సేవలకు అంతరాయం కలగకుండా పవర్ బ్యాక్ అప్ నిర్వహించాలని మొబైల్ ఆపరేటర్లకు ఆదేశించినట్లు తెలిపారు. అన్ని ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు అంతరాయం కలుగకుండా జనరేటర్లు ఇతర బ్యాక్ అప్ ఏర్పాట్లు చేశామన్నారు. 86 మంది గర్భిణులను ఇప్పటికే ఆసుపత్రులకు తరలించామనిచెప్పారు. పునరావాస కేంద్రాల వద్ద వంట ఏజెన్సీల ద్వారా ఆహార పదార్థాల తయారీకి సిద్ధం చేశామని తెలిపారు. మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్ఐలు సమన్వయంతో పనిచేయాలని, పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాలు పడిపోతే వాటిని వెంటనే పునరుద్ధరించేందుకు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు 54 జనరేటర్లు ఏర్పాటు చేశామన్నారు. పారిశుధ్య నిర్వహణకు 2872 బ్లీచింగ్ బస్తాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. గ్రామాల్లో వాలంటీర్, దండోరా ద్వారా తుపాను సమాచారం తెలియజేశామన్నారు.

దళితులకు న్యాయం చేయాలి

కెవిపిఎస్, వ్యకాస ఆధ్వర్యాన ఆందోళన తహశీల్దార్ కార్యాలయం వద్ద 36 గంటల ధర్నా అక్కడే వంటా వార్పు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని శివ్వాం గ్రామ దళితుల భూ సమస్య పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. 36గంటల ధర్నా చేపట్టి అక్కడ వంటా వార్పు చేశారు. శివ్వాం గ్రామ దళితులకు ప్రభుత్వం 1970వ సంవత్సరంలో సర్వే నెంబరు 20, 30లో 14 మందికి 22 ఎకరాలు పంపిణీ చేసింది. దళితుల జీవన ప్రమాణలను మెరుగుపరుచుకునేందుకు అప్పటి ప్రభుత్వం భూ హక్కు కింద పట్టాలు మంజూరు చేసింది. అయితే ఇటీవల కొంతమంది గ్రామ పెత్తందారులు అధికారులను, కోర్టులను సైతం తప్పుతోవ పట్టించి దళితుల భూమిని కాజేసేందుకు కుట్ర పన్నారు. ఈనేపథ్యంలో దళితులంతా తమకు న్యాయం చేసి తమ భూమిని రక్షించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. అక్కడే వంటావార్పు చేసుకొని నిద్రించారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ ఇటీవల కొంతమంది పెత్తందారులు తప్పుడు సర్వే నంబర్లతో 20,30 నెంబర్లకు బదులు 102 సర్వే నెంబర్ వేసి సంబంధం లేని



దీక్షా శిబిరం వద్ద నిద్రిస్తున్న బాధితులు



తహశీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న కెవిపిఎస్ నాయకులు రెడ్డి వేణు

వ్యక్తులను ప్రతి వాదులుగా చేర్పించి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నట్లు అధికారులను తప్పుతోవ పట్టించారని తెలిపారు. దళితులను భూములపైకి రానీయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. కెవిపిఎస్ నాయకులు రెడ్డివేణు మాట్లాడుతూ ప్రభుత్వ సమగ్ర భూ సర్వే జరిపి ఎవరి భూమిపై వారికి హక్కులు కల్పిస్తున్న తరుణంలో పెత్తందారులు తప్పుడు పత్రాలు సృష్టించి దళితుల భూములను కాజేసేందుకు కుట్ర పన్నుతున్నారని అన్నారు. సమస్యను పరిష్కరించేవరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ ఈశ్వరరావు మాట్లాడుతూ దళిత భూ సమస్యను వెంటనే అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తప్పుడు పత్రాలను సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు ఎల్లయ్య లక్ష్మణరావు. ఫకీర్, శివ, అప్పలస్వామి, సింహాచలం, నాని తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సేవలు మెరుగ్గా అందాలి : రాజన్నదొర

ప్రజాశక్తి -భామిని

పోలీస్ సేవలు క్షేత్ర స్థాయిలో మెరుగ్గా అందాలని, మారు మూల గిరిజన ప్రాంతం, ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులో ఇటువంటి మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణం చాలా ఆనందదాయకమని డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర, ఎమ్మెల్యే కళావతి అన్నారు. మండలంలోని బత్తిలిలో రూ.4 కోట్లతో నిర్మించిన నూతన మోడల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, విశాఖ రెంజీ డిఐజి హరికృష్ణ, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి, డిఎస్‌పి జివి కృష్ణారావు, సిఐ మురళీదర్, ఎస్ఐ వై. అమ్మన్నారావు, ఎంపిపి తోట సింహాచలం, సర్పంచ్ టింగ శాంతికుమారి, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనులకు భూ పట్టాలు పంపిణీ

మండలంలోని అర్హులైన దళిత, గిరిజనులకు రాజన్నదొర పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సుమారు వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమిని 1175 మందికి శాశ్వత హక్కు కల్పిస్తున్నామని, మీరు ఈ భూమిని అమ్ముకోరాదని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భామినిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు, ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లు అంశాలు పరిశీలించి ఈ మండలం అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరారు. జిల్లాకు మారుమూల ఉన్న భామినిలో డిగ్రీ కాలెజీ, పెట్రోల్ బంక్, స్టేట్ బ్యాంకు, ఎటిఎం సెంటర్ ఏర్పాటయ్యేలా చొరవ చూపాలని రాష్ట్ర గిరిజన సంఘం ఉపాధ్యక్షులు బిడ్డికి తేజేశ్వరరావు తెలిపారు.

మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు, ఇతర మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. బత్తిలి పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా మార్గమధ్యలో ఉన్న గుమ్మలక్ష్మీపురం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిశిఖర గ్రామాలకు రహదారులను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని ఇందుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుకు తగిన కృషి చేస్తున్నామన్నారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాల భవనాలను నిర్మించామని, విద్యార్థులకు కావాల్సిన ఫర్నీచర్ తదితర సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయనిగుర్తు చేశారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాల మెరుగునకు సాలూరు, పార్వతీపురం, కురుపాం, భద్రగిరి తదితర ఆసుపత్రులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, అదనపు భవన నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడానికి తగిన పథకాలను తాము చేపడుతున్నామని చెప్పారు. రాజన్న దొర గుమ్మలక్ష్మీపురం వచ్చిన సందర్భంగా ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పోలీసు స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పోక్సోకేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలుశిక్ష

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

బాలికను మోసగించి, లైంగికంగా అత్యాచారం చేసిన సంఘటనలో పార్వతీపురం పట్టణానికి చెందిన ముద్దాయికి పోక్సో చట్టం కింద కోర్టు 20ఏళ్ల కఠినకారాగార శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణం గొడగల వీధికి చెందిన బొత్స కామేశ్వరరావు (కామేష్) అనే వ్యక్తి 2022 సెప్టెంబర్‌లో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయరాజుకాలనీకి చెందిన 9వ తరగతి చదువుతున్న బాధిత బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో లైంగికంగా పలుమార్లు అత్యాచారం చేసి, గర్భవతిని చేశాడు. పెళ్లిచేసుకోమని బాలిక నిలదీయడంతో తిరస్కరించాడు. బాధితురాలి తల్లి ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు అప్పటి డిఎస్పీ ఎ.సుభాష్ ఆధ్వర్యంలో విచారణ జరిపి పలు సెక్షన్లపై కేసులు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి నాగమణి ముద్దాయికి 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటుగా రూ.4వేలు జరిమానాను సోమవారం విధించారు. బాలికకు పరిహారం కింద రూ.5లక్షలు మంజూరు చేశారు. ఈ కేసులో పోలీసు సిబ్బంది కృషిని, కేసు సత్వరమే పరిష్కారానికి కృషి చేసిన ఎస్ఐ ఎం.సత్యనారాయణ, హెచ్‌సి కె.అప్పలరాజులను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అభినందించారు.



అన్‌లోడ్ చేయని లారీ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

మిల్లర్ల వైఖరిపై రైతుల నిరసన

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

ధాన్యం కొనుగోలులో మిల్లర్లు అనుసరిస్తున్న వైఖరి పట్ల రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎట్లకేలకు అధికారులు చొరవ తీసుకుని కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభించగా, రైతులు లారీలతో లోడ్‌చేసి పంపిన ధాన్యాన్ని మిల్లర్లు దిగుమతి చేసుకోనేందుకు నిరాకరించడం, బస్తాకు 10 నుండి 14కేజీలు తేమశాతం పేరిట డిమాండ్ చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పార్వతీపురం మండలం ఆడ్డాపుశిల, బంటువాని వలస రైతులకు చెందిన ధాన్యం పార్వతీపురం మండలం, నర్సిపురంలోని వెంకటపద్మ మోడరన్ రైస్ మిల్లుకు, పట్టణంలోని రాయగడరోడ్ శివారులో ఉన్న వెంకటేశ్వర మోడరన్ రైస్ మిల్లుకు 4 లారీలతో తరలించగా, ధాన్యం తేమశాతం ఎక్కువ ఉన్నందున తాము ససేమిరా దిగుమతి చేసుకోమని, లోడ్‌ను దించాలంటే బస్తాకు రూ.5 కూలీతో బస్తాకు 14 కేజీలు తరుగు ఇవ్వాలని డిమాండ్ చేసి ఉదయం 11గంటలకు వెళ్లిన లారీలను సాయంత్రం వరకూ నిలుదల చేయడంతో లారీ సిబ్బంది గగ్గోలు పెట్టారు. విషయం తెలుసుకున్న ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో మిల్లుకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. సమస్యను పరిష్కరించడానికి రెవెన్యూ అధికారులు ఇచ్చిన టోల్‌ఫ్రీ నెంబరుకు చేయగా, అది పనిచేయకపోవ డంతో బంటుదాసు నేరుగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావుకు సమస్యను వివరించారు. మిల్లర్ల పేర్లు నమోదు చేసుకుని, సిబ్బందిని పంపి తక్షణమే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు రాకూడదు

ప్రజాశక్తి - పార్వతీపురం

ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ధాన్యం సేకరణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నూర్పులు జరిగిన 4,200 మెట్రిక్ టన్నుల్లో 629 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉండగా, మిగిలిన మొత్తం ధాన్యం తుపాను తీవ్రత దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన మిల్లులకు తరలించామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఆఫ్ లైన్ నందు ధాన్యం కొనుగోలు చేశామని, ఆఫ్ లైన్‌లో తీసుకున్న ధాన్యానికి సంబంధించిన పేమెంటుకు ఇబ్బందులు లేకుండా వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఇ-క్రాప్ బుకింగు చేసిన పంటను మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసిన గన్నీ బ్యాగుల నాణ్యతను తనిఖీ చేయాలని, పాడయిన గోనులు సరఫరా చేస్తే వాటి స్థానంలో కొత్తవి సరఫరా చేయాలని తెలిపారు. జిల్లాకు సరఫరా అయ్యే బియ్యం నిల్వకు గోడౌన్లను సిద్ధం చేయాలని కలెక్టరు తెలిపారు. సమావేశంలో జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు, కె.ఆర్.సి.సి. డిప్యూటీ కలెక్టరు కేశవనాయుడు, సివిల్ సప్లయి జిల్లా మెనేజరు దేవుళ్ల నాయక్, జిల్లా సప్లయి అధికారి శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అదికారి రాబర్ట్ పాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై చర్చలు 13కు వాయిదా

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని గత నెల 30న ఎస్ఎఫ్ఐ నిర్వహించిన ధర్నాతో దిగి వచ్చిన అధికారులు ఈనెల 6న జిల్లా విద్యాశాఖ, సంబంధిత అధికారులతో చర్చలకు హామీ ఇచ్చిన విషయం తెలిసినదే. అయితే ప్రస్తుత వాతావరణ అననుకూల పరిస్థితుల కారణంగా డిసెంబర్ 13కు వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్‌కు సమాచారం వచ్చింది. ఈ మేరకు చర్చలు వాయిదాపడినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఈ ప్రకటనను విడుదల చేసింది. ఈ ప్రకటనను గమనించాలని విద్యార్థులకు, మేధావులకు రాజశేఖర్ కోరారు.

సువర్ణముఖి స్పిల్‌వే గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - మక్కువ

తుపాన్ కారణంగా వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు పరిధిలోని సువర్ణముఖ నది స్పిల్‌వే గేట్లను ఎత్తి దిగువుకు నీరు విడుదల చేసినట్టు విఆర్ఎస్ ఇంజనీరింగ్ అధికారి రాజశేఖర్ తెలిపారు. సుమారు వెయ్యి క్యూసెక్కుల నీరు బయటకు వెళ్లేలా గేట్లను ఎత్తి ఏర్పాట్లు చేశామన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున ముందుగా ఈ చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

రైతు భరోసా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాసిపేట రైతు భరోసా కేంద్రాన్ని ఆర్‌డిఒ కె.హేమలత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాను కారణంగా రైతులు సిద్ధం చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తక్షణమే తరలించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అంటిపేట రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యాన్ని ట్రక్ సీట్లు కొత్త ట్రాక్టర్లతో తరలించిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్ అవినాష్, వ్యవసాయ సిబ్బంది, రైతులు, ఆయా గ్రామ సర్పంచులు బొంగు తిరుపతిరావు, మాజీ సర్పంచ్, సిరికి మహేష్ పాల్గొన్నారు.

ఆధార్ మార్పిడితో అక్రమ పింఛన్లు

ప్రజాశక్తి - బెలగాం



పిఒకు వినతినిస్తున్న జనసేన నాయకులు

పార్వతీపురం మండలంలోని ఎమ్మార్ నగరం గ్రామ సచివాలయ పరిధిలో ఆధార్ కార్డులో వయస్సు మార్పిడి చేసి అక్రమంగా పింఛన్లు పొందుతున్నారని జనసేన నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్‌కు జనసేన పార్టీ నాయకులు అన్నాబత్తుల దుర్గాప్రసాద్, వంగల దాలినాయుడు తదితరులు కలిసి వినతిని అందజేశారు. గత కొంతకాలంగా ఆధార్ కార్డులో తక్కువ వయస్సును, ఎక్కువ చేసి అక్రమంగా పింఛన్లు పొందుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు ఆధారాలతో కూడిన వివరాలను అందజేశారు. దీనికి స్పందించిన పిఒ దీనిపై దర్యాప్తు చేయాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే తుపాను దృష్ట్యా పార్వతీపురం పట్టణ మెయిన్ రోడ్డు తో పాటు సౌందర్య సినిమా హాలు ప్రాంతం, నెల్లిచెరువు గట్టు, బైపాస్ కాలనీ, జనశక్తి కాలనీ తదితర ముంపుకు గురవుతున్నాయన్నారు. కావున అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని వినతిని అందజేశారు.



ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న నాయకులు

ఫెన్సింగ్‌లో పిటిజి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు స్థానిక ఏపి గిరిజన గురుకుల(పిటిజి) పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బి. ప్రవల్లిక ఎంపికైనట్లు ఇన్చార్జి ప్రిన్సిపాల్ యుగంధర్ తెలిపారు. ఈ నెల 3న శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రవల్లిక ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక అవడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, ఎంపిపి దీనమయ్య, ఎంఇఒ చంద్రశేఖర్, జనార్దన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈనెల 8,9,10 తేదీల్లో విజయనగరంలో జరిగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా పతకాన్ని సంపాదించేలా ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తిరుపతిరావు ఉన్నారు.

టిటిడి ఆలయాన్ని దర్శించుకున్న రాజన్నదొర

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం (శ్రీవారి ఆలయాన్ని) సోమవారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి డిప్యూటీ సీఎం రాజన్న దొర దర్శించుకున్నారు. ఆలయం చాలా బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే వి. కళావతి, ఎంపిపి ఆదినారాయణ, ఎఎంసి చైర్మన్ హెచ్ మోహన్ రావు, నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

లక్ష్మయ్య ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

శ్రీకాకుళం రైతాంగ పోరాట ఉద్యమ నాయకులు, ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ కొండగొర్రె లక్ష్మయ్య 13వ వర్ధంతి వేడుకలను మండలంలోని కుక్కిడి పంచాయితీ కేశవడ గ్రామంలో సోమవారం నిర్వహించారు. లక్ష్మయ్య గిరిజన రైతుల పక్షాన ఉంటూ భూస్వాములకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నారని చెముడు గూడ ఎంపిటిసి మండంగి రమణ తెలిపారు. లక్ష్మయ్య ఆశయ సాధనకు గిరిజనులు తమ హక్కుల సాధనకు భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బిడ్డిక శంకరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయంతో మన్యంలో వేడుకలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా మండలంలోని మారుమూల ప్రాంతం, పార్వతీపురం మన్యం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మక సింహాచలం స్వగ్రామైన చింతలపాడులో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మయ్య, జిల్లా ఎస్‌టి విభాగం అధ్యక్షులు కిల్లక రాఘవేంద్రరావు, నియోజకవర్గ యూత్ కోఆర్డినేటర్ సుమన్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ పార్టీ విభాగం చందు, గిరిజన విభాగం నియోజకవర్గం అధ్యక్షులు కృష్ణారావు, నాయకులు రంజిత్ కుమార్, ఫకీరు, మల్లేష్ పాల్గొన్నారు.

జి.శివడలో మా నమ్మకం నువ్వే జగన్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో జి.శివడ గిరిజన గ్రామంలో మా నమ్మకము నువ్వే జగనన్న కార్యక్రమం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి శెట్టి పద్మావతి హాజరై ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి వివరించి జగనన్నే మళ్లీ ఎందుకు కావాలో ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.మిన్నారావు, స్థానిక వైసిపి సీనియర్ నాయకులు జి.రాజారావు, మండల కన్వీనర్ ఐ. గౌరీ శంకర్, జెడ్‌పిటిసి జి. సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు, గుజ్జువాయి సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు, ఆకుల శ్రీధర్, రాయపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఐజి

ప్రజాశక్తి-భోగాపురం

స్థానిక పోలీస్ స్టేషన్‌ను విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నమోదైన కేసులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కన్నా ప్రస్తుతం ఎఒబి లో మావోయిస్టుల కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయని అన్నారు. ఎస్‌పి దీపిక పాటిల్, డిఎస్‌పి గోవిందరావు, సిఐ బివి వెంకటేశ్వరరావు, ఎస్‌ఐలు కృష్ణమూర్తి, సూర్య కుమారి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగులందరికీ మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు మేలుకొలుపు దీక్ష నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘాల నాయకులు పోలినాయుడు, ఈశ్వరరావు, దివాకర్, లక్ష్మణరావు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ తదితరులు మాట్లాడుతూ విద్యాశాఖలో విశిష్ట సేవలు అందిస్తున్న సమగ్ర శిక్ష 18 విభాగాల ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యను అభ్యసించి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తింపు పొందుతామన్న ఆశతో గత 20 ఏళ్లగా పనిచేస్తున్నామని, కానీ ప్రభుత్వం నేటికీ ఆ ఆశలు నెరవేర్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నేటికీ ప్రభుత్వ ఉద్యోగుల వలె సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదని అన్నారు. గత మూడు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఒకటో తారీఖున జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్ట్ టైం విధానాన్ని పూర్తిగా రద్దు చేసి కాంట్రాక్ట్ విధానంగా మార్పు చేసి సర్వీస్ నిబంధనలను రూపొందించాలని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే ఈనెల 11న విజయవాడలో జరుగు ధర్నాలో సమగ్ర శిక్ష ఉద్యోగులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భాను ప్రకాష్, శ్రీదేవి, రమేష్, నరసింహచారి, తిరుమలదేవి, బుజ్జి, సుధా, గీతా, జానకి, దివాకర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

పూర్తిస్థాయిలో వినతులు పరిష్కరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టరు అర్.గోవిందరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జెసితో పాటు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టరు కేశవనాయుడుతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 120 అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సీతంపేట: వినతులను పరిశీలిస్తున్న పిఒ కల్పనకుమారి

జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన

పార్వతీపురం రూరల్ : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో సోమవారం అదనపు ఎస్‌పి దిలీప్ కిరణ్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించి పలు గ్రామాల నుంచి వచ్చిన సందర్శకుల నుంచి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు విన్నవించుకోగా, వారి సమస్యలపై ఎఎస్‌పి సానుకూలంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ ఎన్‌వి ప్రభాకర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

సీతంపేట: సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు వినతులు సమర్పించారు. సోమవారం స్పందన కార్యక్రమం పిఒ కల్పనకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. పాండ్ర మానుగూడకు చెందిన రమేష్ పట్టా మంజూరు చేయాలని కోరారు. చింతల గూడకు చెందిన తురకన్న ఆర్ఒఎఫ్ఆర్ కట్ట మంజూరు చేయాలని, చిన్న గోరకాలనికి చెందిన కామేశ్వరరావు విద్యుత్ స్తంభాలు వేయాలని, లోవ గూడ కాలనీకి చెందిన వెంకటరావు చెరువు మరమ్మత్తులు చేయాలని వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రోషిరెడ్డి, డిడి మంగవేణి, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలం, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, సిడిపిఒ రంగలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, పి హెచ్ఒ గణేష్, పిఎఒ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం : ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఖాళీగా ఉన్న 7 అంగన్వాడీ కార్యకర్తలు, 19 సహాయకులు, 8 మినీ అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ పీడీ ఎం.ఎన్.రాణి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొమరాడ ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్వాడీ కార్యకర్త, 5 సహాయకుల, ఒక మినీ అంగన్వాడీ పోస్టు, పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్వాడీ కార్యకర్త, రెండు సహాయకుల, ఒక మినీ అంగన్వాడీ పోస్టు, పాచిపెంట ప్రాజెక్టు పరిధిలో మూడు అంగన్వాడీ కార్యకర్త, ఆరు అంగన్వాడీ సహాయక, నాలుగు మినీ అంగన్వాడీ పోస్టులు, సాలూరు ప్రాజెక్టు పరిధిలో పరిధిలో ఒక అంగన్వాడీ సహాయక, ఒక మినీ అంగన్వాడి పోస్టు, కురుపాం ప్రాజెక్టు పరిధిలోని రెండు అంగన్వాడీ కార్యకర్త, నాలుగు సహాయకుల పోస్టులు, భద్రగిరి ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్వాడీ సహాయకురాలు, ఒక మినీ అంగన్వాడి పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన వివాహిత మహిళా అభ్యర్థినులు దరఖాస్తులను ఈనెల 6 నుంచి 14 సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలం తదుపరి తెలియజేస్తామన్నారు. నిబంధనల మేరకు వచ్చిన దరఖాస్తుదారులను మాత్రమే ఇంటర్వ్యూలకు పిలవనున్నట్లు తెలిపారు. పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 2023 జూలై 1 నాటికి 21-35 మధ్య వయసు కలిగి, స్థానిక స్థిర నివాసం కలిగిన వివాహిత మహిళలు ఈ పోస్టులకు అర్హులన్నారు. ఎస్‌సి, ఎస్‌టి హేబిటేషన్లలో వారిని మాత్రమే భర్తీ చేయడం జరుగుతుందని, ఈ ప్రాంతాల్లో 21 ఏళ్ల నిండిన వారు లేనియెడల 18ఏళ్ల నిండిన వారిని నియమించవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

పిహెచ్‌సిలో డిఐఒ తనిఖీలు

ప్రజాశక్తి- సీతానగరం

తుపాను హెచ్చరికల నేపథ్య ంలో ముందస్తు చర్యలు పరిశీలనలో భాగంగా పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సోమవారం పరిశీలించారు. అత్యవసర చికిత్సకు అవసరమైన మందులు, వైద్య పరికరాలు, పరీక్షలు, పాముకాటుకు గురైన వారి చికిత్సకు అవసరమైన యాంటీ స్నేక్ వీనం (ఎఎస్‌వి) ఇంజెక్షన్ల లభ్యతను తనిఖీ చేశారు. ఇవన్నీ అందు బాటులో సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా తగు ఏర్పాట్లు ఉండాలన్నారు. ఇన్వర్టర్, బ్యాటరీ పని తీరును పరిశీలించారు. వీటిని తరచుగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఏ సమయంలోనైనా వైద్య సేవలందించేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. షిఫ్ట్ డ్యూటీలు ప్రణాళిక వేయాలని, సిబ్బంది ఫోన్ కాల్స్‌కు తక్షణమే స్పందించాలని సూచించారు. అన్ని వెల్నెస్ కేంద్రాల్లో మందులు, ఐవి ఫ్లూయిడ్స్, పరీక్షలు సిద్ధంగా ఉండాలని, అన్ని గ్రామాల్లో ప్రాథమికంగా అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. కాన్పు సమయం దగ్గరగా ఉన్న గర్భిణుల వైద్య సంరక్షణకై అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని ప్రజలు ఎంటువంటి ఆందోళన చెందకుండా సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో వైద్యాధికారి డాక్టర్ ఎమ్. రాధా కాంత్, సూపర్ వైజర్స్ జి.సూర్యనా రాయణ, వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




రికార్డులను పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

ఆశాలు, సిహెచ్‌డబ్ల్యుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బెలగాం

ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.శివాని, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు , జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారికి సోమవారం వినతిని అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఆశా వర్కర్లపై ఆన్లైన్లో రికార్డు, మొబైల్ వర్క్ వంటి అదనపు పనులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. పని ఒత్తిడి పెరగడంతో ఆశా కార్యకర్తలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం వేతనాల్లేకుండా, సంక్షేమ పథకాలు సక్రమంగా ఇవ్వకుండా, మెడికల్, మెటర్నర్ సెలవులు అమలు చేయకుండా పిహెచ్‌సికి వచ్చిన ప్రతి సందర్భంలో టిఎ, డిఎ ఇవ్వకుండా ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటుందని విమర్శించారు. కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, మెడికల్, ప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలని, రూ.10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని, 62 ఏళ్లకు రిటైర్మెంట్ జీవోను వర్తింపచేయాలి. ఎఎన్ఎం హెల్త్ సెక్రటరీ పోస్టుల భర్తీలో ఆశాలకు వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, పి.లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



జెసికి వినతినిస్తున్న నాయకులు

పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎంపిపి ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడులు అన్నారు. మండలంలోని రావివలసలో సోమవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణతో పాటు జెండాను ఎగురువేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ అందించలేని సంక్షేమ పథకాలను సిఎం జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొత్స అప్పుడు, తోటపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, ఎంపిడిఒ జి. పైడితల్లి, మండల ఇఒపిఆర్‌డి ఎల్ గోపాలరావు, వైసిపి నాయకులు గుంట్రెడ్డి శంకరావు, ముదిలి గౌరునాయుడు, నేరడుబిల్లి జనార్ధననాయుడు, గంట లక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ బాణాల సురేష్, పంచాయతీ కార్యదర్శి రంభ శశికుమార్, గ్రామ సచివాలయాల ఎంఎల్ఒ పెరుమాళ్ళ వాసు, ఆచారి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

సచివాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - సీతంపేట

గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, సామాజిక భవనాల్లో పనిచేసే సిబ్బందికి, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల్లేవని, వెంటనే ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు, మండల కార్యదర్శి భాస్కరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పూతికవలస, కిండంగి, గోయిది, పుబ్బడ, కీసరజోడు సచివాలయాల నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదన్నారు. సచివాలయాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని, నిర్మాణాలు పూర్తయిన భవనాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

36 గంటల ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

ఈ నెల 11,12 తేదీల్లో ఆశ వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలపైన కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న 36 గంటల ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు ఆర్ రాజేశ్వరి పిలుపునిచ్చారు. సోమవారం ధర్నాను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలు రోజురోజుకి పెరుగుతున్నాయని పని భారం పెరుగుతుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో రికార్డు వర్క్, మొబైల్ వర్క్ లాంటి ఒత్తిడితో పనిబారం పెరగడం వల్ల ఆశ వర్కర్లు అనారోగ్య సమస్యల గురవుతున్నారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని తదితర సమస్యల పరిష్కారం కోసం 36 గంటల ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

అధికారులను ఆదేశించిన ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి- సాలూరు

మున్సిపాలిటీలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన మున్సి పాలిటీలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిం చారు. భారీ వర్ష సూచన కనిపిస్తున్న నేపథ్యంలో చెరుకుపల్లి గెడ్డ కాలువ ద్వారా పట్టణానికి నీరు చేరే ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఏటా భారీ వర్షాలు పడినప్పుడు ఫిలడెల్ఫియా ఆసుపత్రి ముందున్న కాలువ పొంగిపొర్లి వరద నీరు రామాకాలనీలోకి చేరడంపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెదహరిజనపేట, చినహరిజనపేట, రామాకాలనీ ప్రాంతంలో లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. బాధిత ప్రజలకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు. వారికి ఆహారం, వంట సామాగ్రి అందుబాటులో వుంచాలని సూచించారు. పట్టణంలోని కాలువల్లో పూడికలు తీయాలని, వర్షం నీరు రోడ్డు పైకి రాకుండా చూడాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతంలో నీరు నిల్వ వుండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ టి.జయరాం, తహశీల్దార్ బాలమురళీకృష్ణ, ఎంపిడిఒ జి.పార్వతి, మున్సిపల్ ఎఇ సూరినాయుడు వున్నారు.



పిఒకు లోతట్టు ప్రాంతాలపై వివరిస్తున్న అధికారి

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి

వేపాడ: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సచివాలయ సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని పాటూరు సచివాలయ సిబ్బందితో ఎంపిడిఒ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో సచివాలయ పరిధిలో 300 వరకు రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి సంధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో, పెయింటింగ్ పోటీలు

నెల్లిమర్ల: వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఛాయాచిత్ర, పెయింటింగ్ పోటీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ సన్నీడయోల్, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ రమణారావు, డాక్టర్ శ్రావణి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయానికి పోటెత్తిన జనం

ప్రజాశక్తి-వేపాడ

కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాలు కిటకిటలాడాయి. ఆలయాలకు భారీగా యాత్రికులు తరలివచ్చారు. వేపాడ మండలంలోని బానాది, కొండగుల్ల శివాలయాలకు తెల్లవారుజాము నుంచే యాత్రికులు చేరుకుని, పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

ఇబ్బందుల్లేకుండా చూడాలి

ప్రజాశక్తి - పాలకొండ

తుపాను కారణంగా ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు అన్నారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలను పరిశీలించి శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. నీటిసరఫరాకు ఇబ్బందల్లేకుండా చూడాలన్నారు. తుపాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై నీరు లేకుండా కాలువలు శుభ్రం చేయాలన్నారు.

పలుచోట్ల వికసిత్‌భారత్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని తాళ్లబురిడి, డోకిశిల సచివాలయ ప్రాంగణాల్లో సోమవారం ఎంపిడిఒ అకిబ్‌జావేద్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంచార వాహనంలో కేంద్రప్రభుత్వం గిరిజనులకు, రైతులకు, మహిళలకు, బాలబాలికల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానికంగా ఉన్న కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బలగరేవతమ్మ, సర్పంచ్‌లు, సచివాలయ కార్యదర్శులు నాయకులు బలగ నాగేశ్వరరావు, బొమ్మిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం :మండలంలోని ఉదయపురం, ఉరిడి గిరిజన గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, వైద్యాధికారిని ప్రజ్ఞ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగి ఇంకా నమోదు కాకపోతే భారత్ సంకల్ప్ యాత్రలో వెంటనే నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

రాజశేఖర్‌ను కలిసిన రాజన్నదొర

పాలకొండ: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, వైసిపి సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరంను ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొర సోమవారం కలిశారు. కొద్ది సేపు రాజకీయాల కోసం చర్చించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు శాసన మండలి విప్ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, వైసిపి పట్టణ అధ్యక్షులు వెలమల మన్మథరావు, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడులు ఉన్నారు.

సచివాలయ సందర్శన

పాలకొండ : మండలంలోని చిన్నమంగళాపురం సచివాలయాన్ని సోమవారం ఎంపిడిఒ డొంక తిరునాధులు సందర్శించారు. తుపాను హెచ్చరికలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలని ఉద్యోగులకు సూచనలు చేశారు. క్రీడాకారులు పేర్లను నమోదు చేయాలన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

పాలకొండ: మండలంలోని సింగన్నవలస జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు ఎం.రాంప్రసాద్, మధన్‌మోహన్, మన్మథరావు తదితరులు సోమవారం ఆర్‌డిఒ ఎం.లావణ్యకు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ ఎక్కువగా ఉండడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడుకు ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

మా కుటుంబాన్ని ఆదుకోండి

బెలగాం: ఉపాధిహామీ చట్టంలో విధులు నిర్వహించే తన భర్త పాలూరు నారాయణరావు మృతి చెందడంతో తమ కుటుంబం వీధినపడిందని, కావున మానవతా దృక్పథంతో ఆదుకోవాలని పార్వతీపురం మండలం సూడిగాంకు చెందిన శాంతి ఎంపిడిఒ అకిబ్ జావేద్‌ను కోరారు. ఈ మేరకు ఆమె సోమవారం సిఐటియు నాయకులు వై.మన్మథరావు, జి.వెంకటరమణ ఆధ్వర్యాన ఎంపిడిఒను కలిసి వినతిని అందజేశారు. తన భర్త చనిపోయిన తర్వాత కుటుంబం కనీస అవసరాలు తీర్చుకోలేని దుర్భరస్థితిలో ఉందన్నారు. తనకు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు వృద్ధులున్నారన్నారు. కుటుంబానికి ఏ ఆధారం లేదని, తన భర్త ఉద్యోగం ఇప్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. దీనికి ఎంపిడిఒ స్పందిస్తూ గ్రామసభ నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.